




"అరే, ఎందుకురా ? మొగుడువిడిచిన ఆడదాని ముఖం పెట్టావు ?''

"హి హి హీ ; హి హి హీ !"

ప్రక్కనే నడచిపోతున్న. పార్వతి చెవుల్లో యీ మాటలు పడ్డాయి. అసలు పడాలనే ఆ విద్యార్థు లన్నది కూడా ! ఇదేం పార్వతికి కొత్తగాదు. ఏడాది నుంచి యీ ఊళ్ళోవుంటున్నా వాళ్ళు అనక మానరు, తనకు వినక తప్పదు ! తను వచ్చిన వారందినాలకే తన పుట్టు పూర్వోత్తరాలన్నీ సమగ్రంగా సంపాదించారు విద్యార్థులు ! అప్పటినుంచీ తను దారిన పోతూంటేచాలు, నలువైపుల నుంచీ యిలాంటి 'కామెంట్లు' కోకొల్లలు! అసలు నేటి విద్యార్థులే అంత ! దారిన తలవంచుకుపోయే ఆడదాన్ని వెక్కిరించడమే చదువుల్లోని సారమని వాళ్ళ అమూల్యాభిప్రాయం !

వచ్చిన కొత్తలో...

సాయంత్రం 5 గంటలకు స్కూలు నుండి నీరసంగా నడిచి వస్తున్నది. మగ పిల్లలహాస్టలు కెదురుగా ఒక గుంపు నిలబడివుంది. పార్వతి దగ్గరకు రాగానే గుసగుస లెక్కువయ్యాయి.

"స్కూల్లో టీచరురా."

"బియ్యేట."

"మొగుడు విడిచాడుట. అసలు న్యాయశాస్త్రం మెప్పుకొన్న మొగుడేనా ?''

"హి హి హీ !''

"ఒక కూతు రుందిట. వైజాగ్‌లో ఎం.బి.బి యస్. వెలగబెడుతున్నదట."

''అరే! నువ్వు చూడలా! మొన్న, సీతారామరాజు బుఱ్ఱకథకి అమ్మా కూతుళ్లు వచ్చారు.''

"వాళ్ళకేమిరా నాయనా! తెగిన గాలి పటాలు!"

నవ్వులు...ఈ నవ్వుల్లో అన్ని గొంతుకలు శృతికల్పాయి.

పార్వతికి యిది ఒకనాటి కథ గాదు. ఒకనాడు ప్రారంభించి, ప్రతి రోజూ జరిగే కథ. తనను మొగుడు విడిచాడు! తనకు ఒక అందమైన కూతురుంది, కూతురూ, తానూ తెగిన గాలిపటాలు. నిత్యం వినబడే మాటల సారాంశం అంతే!

పార్వతి అంటే ఆడా, మొగా అందరికీ కుతూహలం. "ఎవరీమె? ఎవరీ వెనక అండలేని ఆడది? మొగాడు విసరిన వలలో సులభంగా పడ్డ శలభం?" ఈ ప్రశ్నలు పార్వతిని గురించి డొంక తిరుగుడుగా వస్తాయి. పార్వతి సూటి గానే జవాబు చెప్పనంటుంది!

దారంట చకచకా పోతున్న పార్వతికి ఎందుకో ఒకానొక పుర ప్రముఖుడు యిచ్చిన గంభీరోపన్యాసం జ్ఞాపకానికి రాసాగింది. "స్త్రీ దేశానికి వెన్నెముక. ఎక్కడ స్త్రీ అవమానింప బడుతుందో, అక్కడ భగవంతుడుండడు. స్త్రీ మగ వాడి చేతుల్లో కీలుబొమ్మగా వున్నంత వరకు యీ దేశం బాగుపడదు. ఏనాడు స్త్రీ తనకాళ్ళపై తాను నిలబడుతుందో ఆనాడే మన జాతికి విముక్తి!"

తన కామశాంతికై ఎంతోమంది స్త్రీల జీవితాల్లో నిప్పులు చెరగిన దుర్మార్గుడి నోటినుండి స్త్రీపై సానుభూతి వాక్యాలు.

కాని —

తన కాళ్ళమీద నిలబడగల్గిన పార్వతిని చూస్తే వీళ్ళకి పరిహాసం. ఆడవాళ్ళయితే యింకా! నలుగురితో పాటు పేరంటానిక్కూడా పిలవరు ఒక వేళ పిలిచినా పార్వతి పోదు. వాళ్ళ చూపులతూపులను ఎదుర్కొనే శక్తి లేదు! పేరంటాళ్ళంతా తనవైపు బోనులో నిలబడిన ముద్దాయివైపు చూసి నట్లు చూస్తారు! ఇంతకూ తాను చేసిన నేర మేమిటి?

పార్వతి అడుగులు వాటంతట అవే వేగం తగ్గించుకొన్నాయి. నెమ్మదిగా పోతూ ఆమె గతాన్ని నెమరువేయ సాగింది.

తను ఒంటరిగా...లో నివసిస్తున్న ప్పుడు, తనగది కెదురు గదిలో నే ఉండేవా డతను అప్పటికి తను కన్యే ఉద్యోగాభిలాషతో, తలిదండ్రులనుకూడా ఎదిరించి ఒంటరిగా ఉండటానికి సాహ సించింది. యువకుడూ, యువతీ ఎదురు బొదురుగా! అతని ఆకర్షణాజాలంలో పడి చేపలాగ తన్నుకొంది! మధురమైన అతని మాటల పరిమళంలో తను స్మృతే

కోల్పోయింది. పరవశంతో మూసుకు పోయినకళ్ళతో వాడి పిరికిహృదయాన్ని చూడలేకపోయింది. అసలు వాడు మోసం చేస్తాడన్న ఊహే లేకపో యింది. ఏం తక్కువ తనకు! రూపం, విద్య గుణం, కొద్దిగా ధనం అన్నీ ఉన్న తనవంటి అమ్మాయి వధువుగా లభించటమే ఒక అదృష్టం! అలా నమ్మే, అతనికి తన సర్వస్వాన్నీ దోచి యిచ్చింది. అప్పట్లో తనకు రోజూ శరద్రాత్రే! జీవితం నిత్య వసంతమే! జీవిత మాధురిని తనివిదీరా అనుభవిం చింది. వాడెంత నీచుడైనా, యీ విష యంలో వాడికి కృతజ్ఞత తప్పక తెల్పాలి. ఎడారిలాంటి తన జీవితంలో ఆ మధుర స్మృతి "ఒయాసిస్" లా గా మెరుస్తుంది! ఆ అనుభవం జీవనవిష భాండంలో ఒకేఒక అమృత బిందువు!

తను తండ్రి కాబోతున్న వార్త విన కుండానే పరారయ్యాడు వాడు. గర్భవతి అని తెలియగానే అంతా గుసగుసలు పోయారు. అవును! తను పతిత! కాలు జారిన ఆడది! భ్రూణ హత్యకు ఒప్పుకో లేదని, అమ్మా నాన్నా కూడా తన్ను వదిలివేశారు. పాపానికి ఒడిగట్టనందుకు వీళ్ళంతా తనపై కక్ష వహించారు.

అప్పటినుంచీ తనను చూస్తే వీళ్ళకు అలుసు! తనను బాగా వ్యక్తిగతంగా తెలిసిన మొగాళ్ళకు కూడా! కన్ను గీటితే చాలు, వచ్చి ఒళ్ళో వ్రాలుతుందని వీళ్ళ నమ్మకం! తను ఎంత నీతిగా బ్రతికినా అలుసే! అసలు యీ భయాలూ, దిగుళ్ళ తోటే తను త్వరగా ముసలిదైంది. జారి పోయిన యౌవ్వనాన్ని చూచి సంతో షించిన ఆడది తానొక్కతేనేమో!

ఆలోచనలతో నడుస్తున్న పార్వతికి కారు హారన్ వినిపించింది. ఉలికిపడి తొలగిచూచింది. రంగురంగుల సీతా కోకచిలకలా అలంకరించుకొని కల్పలతా, వెంట ఒక పెద్ద ఆఫీసరూ! కల్పలత వ్యవహారం అంతా అందరికీ తెలిసిందే. మేడిపండు వాటం ఆమె భర్త ఆమెను అపనిందలనే బాణాల నుంచి కాపాడడానికి ఏర్పడిన ప్రత్యేక కవచం! అంతే ఆయనపని. ఈ విడ తెల్లవార్లూ యింకో మొగాడితో షికార్లు.

పుట్ట తవ్వితే ఎన్నో పాములు పడ గలు విప్పుతాయి పార్వతి మనసులో ఇంకో సంఘటన మెదిలింది.

ఒకనాడు జనార్ధనరావు అంగడికి చీరలు కొనటానికి వెళ్ళింది వాడు తనకు యింటర్లో క్లాస్‌మేట్. చెడదిరిగి రోగాలు తెచ్చుకొన్నాడు. వాడికీ తన్ను చూస్తే అలుసే! "ఏం కావాలో చూడ వోయి" అని గుమాస్తాకు పురమా యించి, కిళ్ళీ ములుతూ చెత్తనవల నొందాన్ని చదువుతూ కూర్చున్నాడు ఇంతలోనే బిలబిలలాడుతూ, కల్పలతా, జయలక్ష్మి, వరదసుందరీ వచ్చారు అంతా ఒకప్పుడు తన స్నేహితురాండ్రు.

ఇప్పుడు ఆ ఫీ స ర్ల భా ర్య లు. ఇహ జనార్దనరావు హడావిడి చూడాలి! వాళ్ళ అడుగులకు మడుగులొత్తడం తరవాయి. వాళ్ళేమో చీరల బేరం సాకు పెట్టి మాటల్లోనే తమతెలివంతా ఒలకబోస్తు న్నారు. మధ్యన జనార్దనరావూ, వాడి సిబ్బందీ యికిలింపులూ! అసహ్యంవేసి చరచర బయటకొచ్చింది తను.

"సమాజంలో గౌరవనీయలను చూస్తే అసూయా?" తనకుతానే ప్రశ్నించుకొంది పార్వతి.

కల్పలతా, జయలక్ష్మి, వరద సుందరీ, వీళ్ళలాగే అలంకరించుకొని తిరిగే మరికొంతమంది భద్రమహిళలూ పార్వతి మనస్సులో మెదిలారు. భర్తల పేర్లనుంచి వాళ్ళను విడదీస్తే, భర్తల హోదాలనుంచి వాళ్ళను విడదీస్తే, వాళ్లు ఉత్త దిష్టిబొమ్మలే! 'భర్త' భరించేవాడి దన్ను ఏర్పడేటప్పటికి, వాళ్ళకు ఎక్కడ లేని మర్యాద!

సన్నగా నవ్వుకొంది పార్వతి. భారతదేశంలోని పాఠకులందరూ శరత్ సృష్టించిన స్త్రీని చూసి కన్నీరు గార్చారు. వీళ్ళంతా కల్పనా చిత్రాలచేత మాత్రమే కదలింపబడుతారు. ఊహా జీవితాలపైనే వీళ్ళకు ఆశక్తి. ఒకవేళ ఆ పాత్ర ప్రాణం పోసుకొని ఎదట నిలబడితే నవ్వి పరిహసిస్తారు! అవును! ఇదే మనిషిలో సహజ ప్రవృత్తి! చేదు నిజాన్ని మానవుడు భరించలేడు! కల్పననే ప్రేమిస్తాడు!

గబగబ అడుగులు వేసింది పార్వతి ఇల్లు కనిపిస్తున్నది. అదుగో సుధ ఎదురు చూస్తూ నిలుచున్నది. సుధ భాద్రపదాకాశము లాంటి తన జీవితంలో వెలిగే ఏకైక తార!

"ఏమండీ పార్వతమ్మగారూ మిమ్మల్ని మార్చారటగా!" సుంక రత్నమ్మగారు.

"అవునండీ! రాజమండ్రి మార్చారు." జవాబిచ్చింది పార్వతి.

"అబ్బో! చాలా దూరమేనే! పాపం ఉద్యోగం చేస్తున్నాక యివన్నీ తప్పవు కదండీ!"

నవ్వి, ముందుకు సాగింది పార్వతి. పర్సు తెరచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ మరో సారి చూసుకొన్నది. ఒక చిన్న అను మానం తట్టింది పార్వతికి. సుంకురత్నమ్మ విచారించేది తను దూరంగా పోతు న్నందుకా! లేక రోజూ వస్తూ పోతూ ఉన్నప్పుడు నోరు తెరచుకొని తన్ను చూడటానికి ఉండదని దుగ్ధా!

తలెత్తి చూసింది పార్వతి. సుధ నవ్వుతూ ముందు నిల్చుని ఉంది. "ఏమి టమ్మా! మరీ పరధ్యానంగా నడుస్తు న్నావు?'' అంటూ చేతిలోని పుస్తకా లనూ పర్సునూ తీసుకొంది. పార్వతి కాళ్ళూ చేతులూ కడుగుకొని వచ్చేప్పటికి సుధ కాఫీ తెచ్చింది.

కాఫీ త్రాగుతూ యిల్లంతా కలయ జూసింది. సుధ సద్దుతున్నది కాబోలు,

పుస్తకాలన్నీ కట్టలు కట్టి ఉన్నాయి. ఎల్లుండితో తనకూ యీ యింటికీ ఋణం తీరిపోతుంది. వదులుతున్నందుకు దుఃఖమూ లేదూ, సంతోషమూ లేదు; గుండెకు గాయాలు తాకి తాకి, గుండె చుట్టూ ఆవరించిన పల్చని 'పెరికార్డియం' దున్నపోతు చర్మంలా మొద్దుబారి పోయింది.

సుధ తల్లి ప్రక్కనే కూర్చొని స్నేహంతో తడిసిన చూపులను తల్లిపై కురిపించింది. పార్వతి సేదదేరింది.

"ఇక నాలుగుదినాల్లో, కొత్త ఊర్లో ఉంటాము గదమ్మా?" సుధ అంటున్నది.

కొత్త ఊరు! ఊరు కొత్తే గాని మనుషులూ, మనసులూ పాతవేగా! అక్కడకు పోయిన రెండు రోజుల కంతా చరిత్ర పునరావృత మౌతుంది. మళ్ళీ గుసగుసలూ, వికవికలూ!

"ఏమిటమ్మా! ఆలోచనలో పడ్డావు! మళ్ళీ ఎవరన్నా ఏమన్నా అన్నా రేమిటి?" ఈ 'మళ్ళీ' అనే మాటకు అర్థమే లేదు. నిత్యం వందమంది వంద మార్లు ఏదోఒకటి అంటూనే ఉంటారు.

అయితే ఈ మాటలు పైకి అనలేదు పార్వతి. పైకి అన్నమాట లివి:

"ఏం లేదమ్మా! నీ కోర్సు అయిపో తూనే,ఏదో ఒకమంచి సంబంధంచూసి_"

తల్లి నోటిని నెమ్మదిగా మూసి సుధ యిలాగన్నది. "అమ్మా! నాకు నాన్నెవరో తెలియదు. తెలియకుండా ఉండటమే మేలు! తెలిస్తే ఖూనీ చేస్తాను! ధైర్యంగా, నీతిగా నిలచి, నన్ను ప్రపంచంలోకి తెచ్చి, జ్ఞానం ప్రసాదించిన నిన్ను కాపాడుకోవడమే నా కర్తవ్యం. ప్రశాంతమైన ఊర్లో ప్రాక్టీస్ పెడితే, మనిద్దరి జీవితాలూ చల్లగా గడచిపోతాయి. సరే అనమ్మా!"

సుధను దగ్గరికి తీసుకొని, కండ్లు మూసుకొంది పార్వతి. మూసిన కండ్ల నుండి కన్నీరు ధార కట్టింది. నెమ్మదిగా తమాయించుకొని అంది, "నీ చదువూ, విజ్ఞానమూ దేశానికి ఉపయోగించాలి. వైద్యంలో నీకుండే నేర్పు ప్రజలకోసం వినియోగించు."

సుధ తల అడ్డంగా ఊపింది. "దేశం, ప్రజలూ అంటూ నన్ను విసిగించకు. నేను ప్రాక్టీస్ పెట్టేది మన జీవితాలు చల్లగా గడవటానికే. ఈ దేశాన్నీ, యీ ప్రజలనూ నేను ప్రేమించలేను. ఈ 20 వ శతాబ్దిలో నాకు కనపడేదంతా మోసమూ, కుత్సితమూ! నా తల్లిని అవమానించిన యీ దేశాన్ని నేను క్షమించలేను!"

పార్వతి మనసులోనే యిలా ప్రార్థించింది, "హే భగవాన్! అవినీతి ఆదరింపబడి, నీతి అవమానింపబడే యీ దేశంలో స్త్రీని సృజించకు. నీవు మగవాడవే అయివుంటావు! లేకపోతే యింత బాధాకరమైన ఆడ బ్రతుకు నెందుకు సృజించకల్గుతావు?" ★